# 33

# పప్పులోన ఉప్పు కలిపి కుప్పలు పోస్తాడు

రోజూ వెళ్ళినట్టే ఆ రోజునా నరసమ్మ పొలం వెళ్ళింది. కానీ రోజూ వస్తున్నట్టు సందెవేళకల్లా ఇంటికి రాలేదు. 'ఇదిగో వస్తుంది- అదిగో వస్తుంది' అంటూ బసవయ్య జాముపొద్దు పోయిందాకా చూశాడు. అయినా అంతూ పొంతూ లేదు.

బసవయ్యకేమీ పాలు పోలేదు. శేషగిరిని ఇంట్లో వుండమన్నాడు. కానీ తనూ వస్తానన్నాడు శేషగిరి. ఇద్దరూ కలిసి పొలం వచ్చారు, పిల్లి పెసర చేను వొడ్డున నరసమ్మ చచ్చిపడి వుంది.

''చచ్చిపోవడమంటే నాకేమీ తెలియదండీ! మా అమ్మ నిద్రపోతున్నట్లుగా వుంది. వో పక్కగా కోసిన పిల్లి పెసర, ఇంకో చేతిలో కొడవలి, నోటి వెంట నురుగు...'' అని ఆగిపోయాడు శేషగిరి.

నరసమ్మ పాము కరిచి చచ్చిపోయిన, ఏడాది తిరక్కముందే బసవయ్య మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు.

''ఆమె మా పింతల్లేనండి'' అన్నాడు శేషగిరి. అప్పణ్నించీ శేషగిరికి దుర్దినాలు ప్రారంభమయ్యాయి. అయిదారేళ్లపాటు అతనాకష్టాలన్నీ నిశ్శబ్దంగా భరించాడు. తండ్రి ఉన్నప్పుడు మామూలుగా ఉండేపింతల్లి ఆయన లేనప్పుడు కాల్చుకు తినేది. ఈ సంగతి ఇరుగు పొరుగువారు చెప్పినా బసవయ్య వినిపించుకోలేదు. వినిపించుకొని కూడా చేసేదేమీ లేక ఊరుకొన్నాడేమో మనకు తెలీదు.

''నేను ఆ వూళ్ళోనే టీ అంగట్లో వుండేవాణ్ని, కప్పులు కడగడం, బల్లలు తుడవడం, బాయిలర్‌లో బొగ్గులు వేయడం, పాలుతేవడం, టీపొడి, పంచదార కొనుక్కురావడం చేస్తుండేవాణ్ని. మా దుకాణం రోడ్డుమీద వుండేదండీ. బస్సులు ఇక్కడే ఆగుతాయి. ఎదురుబొదురుగా రెండు పెద్ద పెద్ద చింతచెట్లున్నాయి. వాటి కింద చాపలు పడేసేవాళ్లం. వచ్చిన జనమంతా ఆ చాపల మీద కూచునేవారు. వారిక్కావలసిన టీ నేనిపస్తుండే వాణ్ని.

ఆ టీ దుకాణం వో మళయాళిది. అతను మాంచి దక్షత వున్నవాడు. క్రమంగా, రొట్టెలు, బిస్కట్లు, సిగరెట్లు, బీడీలు కూడా అమ్మడం ప్రారంభించాడు. బస్సు డ్రైవర్లను, కండక్టర్లను మంచి చేసుకొన్నాడు. వారికి టిఫిన్లు, టీలు, సిగరెట్లు ఫ్రీగా ఇచ్చేవాడు. బస్సులు మరో పది నిమిషాలు ఆగేవి. మరో పది రూపాయల బేరం సాగేది.

శేషగిరికి చేతినిండా పనే. తెల్లవారు జామున లేస్తే రాత్రి పదకొండు గంటల దాకా, బేరం సాగుతూనే వుంటుంది. అప్పుడయినా శేషగిరి ఇంటికి వెళ్ళేవాడుకాదు. రెండు బల్లల్ని దగ్గరగా జరిపి అక్కడే నడుం వాల్చేవాడు. ''మా నాన్న చాలా చిత్రమయిన మనిషండీ. నన్ను రమ్మని వొక్కసారి కూడా పిలవలా. నేను పోలా, కాకపోతే, అప్పుడప్పుడూ కనిపించేవాడు. ఆయన్ను చూసినప్పుడల్లా, మా అమ్మ గుర్తుకొచ్చేది.'' అన్నాడు శేషగిరి.

మూడున్నర సంవత్సరాల పాటు శేషగిరి ఆ దుకణంలో చింత చెట్టుకింద గడిపాడు. నాయర్‌కూ, అతనికి మంచి అనుబంధం ఏర్పడింది.

ఈలోగా ఊరి పరిస్థితి మారిపోయింది. ఇంకా రెండు టీ దుకాణాలు వెలిశాయి. దాంతో అమ్మకాలు తగ్గిపోయాయి. నాయర్ మలయాళదేశం నుండి వచ్చినవాడు. మిగిలిన దుకాణాల

వాళ్ళు స్థానికులు. ఇంకా దుకాణాన్నే కనిపెట్టుకొని వుంటే మట్టిగొట్టుకుపోయేవాడు.

అతనా షాపును సామానుతో సహా నాలుగువేల చిల్లరకు అమ్మేసి పట్నం చేరుకున్నాడు. నాయర్‌తో పాటు శేషగిరి కూడా పట్నం చేరుకొన్నాడు.

"పదివేల రూపాయలు సినిమా హాలు వాళ్ళకు వడ్డీలేకుండా ఇచ్చి, వీధి వేపున టీ దుకాణం తెరిచాడు నాయరు. ఈలోగా అతని తమ్ములు కూడా వచ్చారు. బేరం అందుకొంది. అందరూ కష్టపడి పనిచేసేవారే. అందువల్ల నా అవసరం వారికి లేకపోయింది" అన్నాడు శేషగిరి.

అయినా శేషగిరిని వారు పొమ్మనలేదు. వారే బండి చేయించారు. లైసెన్సు తీసుకొచ్చారు. సరుకులు కొనడానికి రెండు మూడొందలు మదుపు పెట్టారు. ఈ కొత్త వ్యాపారం ప్రారంభించారు.

ఈ వ్యాపారం శేషగిరికి కొత్తగానీ నాయర్ రెండో తమ్ముడికి కొత్త కాదు అతను చాలా కాలంగా గుంటూరులో ఈ బేరం చేస్తున్నవాడే.

"మనం వొక్కచోటనే పాతుకుపోతే కుదరదు. జనం జాస్తిగా వున్న చోటుకల్లా వెడుతుండాలి. ఉదయంపూట మధ్యాహ్నంపూట స్కూళ్ళ దగ్గర గిరాకీ వుంటుంది. సాయంకాలం బస్సు స్టాండులో గానీ సినిమాహాల్స్ దగ్గరగాని ఉండాలి" అని సలహా యిచ్చాడు శంకరన్.

అనడమేకాదు, వో నెల రోజులపాటు శంకరన్ దగ్గర వుండి అమ్మకాలు కూడా చేశాడు. సరుకు కొనడం, ఆ కొనడంలో వున్న మెలకువలు, సరుకు నాణ్యత, వాటిని బాగు చేయించడం, వేయించడం, రుచి కోసం ఉప్పుకలపడం 'చట్నీ' తయారు చేయడం వగైరా వ్యాపార రహస్యాలన్నీ శేషగిరికి బోధించాడు శంకరన్.

"మూడేళ్ళ నుండి నేనొక్కణ్ణే ఈ పనులన్నీ చేసుకొంటున్నానండీ! గిరాకీ అంతగా వుండనప్పుడు సరుకు కొంటాను. వేయించడానికి కిలోకు అర్ధరూపాయి తీసుకొంటారు. బటానీలు ముందుగా నానేసి కానీ ఉడకబెట్టకూడదండీ! అవి తొందరగా పాచిపోతాయి. అందుకని దోరగా వేడి చేసి, నూనె మసాలాలు కలుపుతాను. పల్లీలు కూడా వేయించి ఉప్పు, కారం, నూనె కలుపుతాను కొన్నింటిలో ఉప్పు మాత్రమే కలుపుతాను. చట్నీ చేయడం కూడా నాకు తెలుసు. పిచ్చిమిర్చి, పెద్ద ఉల్లి, కచ్చాపచ్చాగా నూరి, చింతపులుసులో కలుపుతాను. తాలింపు వేస్తాను. కొత్తిమీరి, కరివేపాకు, పొదినా ఆకు తుంపులు చేసి వేస్తాను. దాంతో పచ్చడికి యమరుచి వస్తుంది" అన్నాడు శేషగిరి.

అలా వస్తున్నది గనుకనే అతని వ్యాపారం ఝామ్మనిసాగిపోతున్నది. శంకరన్ చెప్పినట్లుగా ఉదయం - మధ్యాహ్నం స్కూళ్ళదగ్గర ఉంటాడు. సాయంకాలం పూట కొత్తగా కట్టిన సినిమా హాలు దగ్గర ఉంటాడు.

అమ్మకాలను గురించి అడిగినప్పుడు శేషగిరి వో క్షణం తటపటాయించాడు. "ఉదయం, మధ్యాహ్నం కలిపి 80, 90 రూపాయల అమ్మకం వుంటుందండీ. సినిమా కొత్తదయితే, మంచిదయితే, అక్కడో 60, 70 దాకా అమ్ముతాను. రెండో ఆట ఇంటర్‌వెల్ అయ్యాక ఇంటికిపోతాను" అన్నాడతను. అతనికి వేరే ఇల్లు లేదు. నాయర్ కుటుంబంలోనే ఉంటున్నాడు. అక్కడే వారితో పాటే తింటాడు. అక్కడే పడుకుంటాడు. అందుగ్గాను నెలకు నూటపాతిక రూపాయలిస్తున్నాడు. ఇప్పటి దాకా అమ్మిన అమ్మకాలన్నీ నాయర్‌కే ఇస్తున్నాడు శేషగిరి. తన పేరున నాయర్ కొంత బ్యాంకులో వేస్తున్నాడట.

కొంత మొత్తం తన పెట్టుబడి కింద తీసుకుంటున్నాడు.

"ఆ లెక్కలూ, పాడూ నాకు సరిగ్గా తెలియవండి. అన్నీ ఆయన గారే చూస్తున్నాడు. లేదండి! ఆయన నాకు అన్యాయం చేస్తాడన్న ఆలోచన రానేలేదు. చేసేవాడయితే ఎప్పుడో చేసేవాడు. తన బాకి తీరాక ఈ బండిని నాకే ఇస్తానన్నాడు. బ్యాంకులో సొమ్ము పెట్టి నన్నో ఇంటి వాణ్ణి చేస్తానన్నాడు. కన్నతండ్రి చూడకపోయినా, అంతకన్నా మించిన తండ్రి- దేవుడిచ్చిన తండ్రి - నాయర్ నాకున్నాడు. దిగుల్లేదు" అన్నాడు శేషగిరి, బండిని ముందుకుతోస్తూ.